# దివ్యాంగులకు అండగా నిలిచిన కేసీఆర్



సిద్దిపేటలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- అభయ జ్యోతి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో మానసిక దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

సిద్దిపేట, డిసెంబర్ 25 : దివ్యాంగులకు అండగా నిలిచి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలో లయన్స్, అలయన్స్, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు అభయ జ్యోతి సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల పట్ల మానవతా హృదయాన్ని చాటుకున్న నేత కేసీఆర్ అన్నారు. దివ్యాంగులకు రూ.4వేల పింఛన్ ఇచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల రూ.6వేల పింఛన్ వెంటనే ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానసిక దివ్యాంగుల కోసం అభయజ్యోతి స్వచ్ఛంద సంస్థ సేవలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అభయజ్యోతి మానసిక దివ్యాంగుల సంస్థ భవనం కోసం తన వంతు సహాయం అందిస్తానన్నారు. అభయజ్యోతి, లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వినోద్‌మోదాని, ఈశ్వరయ్య, రమేశ్, గంప శ్రీనివాస్, అభయజ్యోతి నిర్వాహకులు జోజి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు పాలసాయిరామ్, ఆడ్డగట్ల శేఖర్, అంజి పాల్గొన్నారు.



సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మిషన్ కమ్యూనికేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# ప్రతి మనిషి నిత్య విద్యార్థి

- నేర్చుకోవాలనే తపన ప్రతిఒక్కరిలో ఉండాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మిషన్ కమ్యూనికేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేట, డిసెంబర్ 25 : ప్రతి మనిషి నిత్య విద్యార్థి. నేర్చుకోవాలనే తపన ప్రతిఒక్కరిలో ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలోని బైరి అంజయ్య గార్డెన్‌లో మిషన్ కమ్యూనికేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య విద్యార్థి.. ఏదో చేయాలనే తపన, లక్ష్యం ఉండాలన్నారు. సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూలు, ఇతర ఇంటర్వ్యూలో సమాధానం చెప్పలేక ఆందోళన పడుతున్నవారికి మిషన్ కమ్యూనికేషన్ ద్వారా ఎలాంటి తడబాటు లేకుండా ఉన్నతస్థాయిలో ఉండేందుకు కోట శ్రీకాంత్ ఒకమంచి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. తాను చదువుకున్న చదువు నలుగురికి ఉపయోగపడేలా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. మిషన్ కమ్యూనికేషన్ సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అందించే శిక్షణకు సహాయం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాలసాయిరామ్, పూజల వెంకటేశ్వర్‌రావు, పోచబోయిన శ్రీహరి యాదవ్, కొండపాక మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా



సిద్దిపేటలో మిషన్‌ను ప్రారంభించిన అనంతరం వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- సిద్దిపేట మోడల్ బస్టాండ్‌లో మిషన్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా చేసుకున్న ఎమ్మెల్యే

సిద్దిపేట, డిసెంబర్ 25 : ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్‌తో క్షణాల్లో డబ్బులను విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని సిద్దిపేట ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం క్యూటిఎం ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట మోడల్ బస్టాండ్‌లో క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా చేసుకునే మిషన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే క్షణాల్లో నగదు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఏర్పాటు చేయడం సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఆధార్‌కార్డు, వేలిముద్ర, డెబిట్, క్రెడిట్ కార్డు, క్యూఆర్ కోడ్ స్కానింగ్, యూపీఐ సర్వీసెస్ ద్వారా నగదు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే టీ హబ్ ద్వారా రూపొందించిన ఈ టెక్నాలజీ సిద్దిపేటలోనే ప్రారంభించారన్నారు. స్కానింగ్ ద్వారా నగదు విత్ డ్రా చేసే విధానం దేశంలోనే మొట్టమొదటిసారిగా సిద్దిపేటలో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ చైర్మన్ చికోటి నరేశ్‌గుప్తా, కో చైర్మన్ షేక్ షమీం, తెలంగాణ స్టేట్ డీలర్ రమేశ్, సిద్దిపేట జిల్లా డీలర్ జనార్దన్‌తో పాటు ఆయా జిల్లాల డీలర్లు పాల్గొన్నారు.

# ‘ప్రజాపాలన’కు ఏర్పాట్లు చేయాలి

- గ్రామ సభలు సజావుగా నిర్వహించాలి
- అలసత్వం వహించవద్దు
- సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని, జిల్లా వ్యాప్తంగా అధికారులు గ్రామ సభల నిర్వహణకు అన్నిఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేకాధికారుల బృందాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన ప్రతి కౌంటర్‌కు ప్రజాపాలన బోర్డు ఉండాలన్నారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు ఆరు గ్యారెంటీలు అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. గ్రామ సభలు సజావుగా జరగాలని, ఆయా అధికారులు, బృందాలు ఎలాంటి అలసత్వం వహించవద్దన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా స్వీకరించాలన్నారు. సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో సురేశ్‌మోహన్, డీఆర్వో నగేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.




సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్

# పకడ్బందీగా నిర్వహించాలి

- 28 నుంచి ‘ప్రజాపాలన’
- అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి
- ఒక రోజు ముందుగానే గ్రామాలు, వార్డుల్లో దండోరా వేయించాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- ప్రజా పాలనపై టెలీకాన్ఫరెన్స్



మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ కోసం కార్యక్రమాన్ని చేపట్టిందని, అందుకోసం జిల్లా వ్యాప్తంగా అధికారులు సిద్ధంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేకాధికారుల బృందాలను నియమించాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాలు (ఆరు గ్యారెంటీ)ల కోసం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు ఆరు గ్యారెంటీలు అందించడం కోసం ఈ పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, వారికి కావాల్సిన కుర్చీలు, టెంట్లు, తాగునీరు, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు గ్రామాలు, వార్డుల్లో దండోరా వేయించాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించబోయే తేదీలు, సమయాలను ముందస్తుగా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.